క్లుప్తంగా

కుట్టు మిషన్లు పంపిణీ



కార్పొరేటర్‌ను సన్మానిస్తున్న మహిళలు

ఖమ్మంమయూరిసెంటర్: నగరంలోని 22వ డివిజన్‌లో జనశిక్ష సంస్థ ఆధ్వర్యంలో ఉచితంగా కుట్టు మిషన్ శిక్షణ పొందిన 70 మంది మహిళలకు స్థానిక కార్పొరేటర్ పల్లా రోజ్‌లీనా ఆధ్వర్యంలో మంగళవారం కుట్టు మిషన్లు పంపిణీ చేశారు. అనంతరం కార్పొరేటర్ మాట్లాడుతూ.. మహిళలను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం అమలు చేస్తున్న కార్యక్రమాలను ఉపయోగించుకొని స్వయం ఉపాధి పొందాలన్నారు. అనంతరం కార్పొరేటర్‌ను మహిళలు సన్మానించారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నగర ప్రచార కార్యదర్శి షేక్.షకీనా, నగర మహిళా అధ్యక్షురాలు తస్నీరు శోభారాణి, పాల్వంచ విజయ, శాంతి, రజీయా, నాగమణి, సోని, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సంతాపం..

ఖమ్మం లీగల్: నగరానికి చెందిన న్యాయవాది దాసరి మనస్విని మంగళవారం మృతి చెందారు. ఈమేరకు ఖమ్మం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు దిరిశాల కృష్ణారావు ఆధ్వర్యాన నిర్వహించిన సంతాప సమావేశంలో ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి మన్నేపల్లి బసవయ్యతో పాటు మాదిరాజు లక్ష్మీనారాయణ, కొల్లి సత్యనారాయణ, బిచ్చాల తిరుమలరావు, ఓరుగంటి శేషగిరిరావు, వై.శ్రీనివాసరావు, పి.దానయ్య, నేర్ల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

నాయకత్వ లక్షణాలు పెంపొందించుకోవాలి

తిరుమలాయపాలెం: యువత చిన్ననాటి నుంచే నాయకత్వ లక్షణాలు పెంపొందించుకోవాలని కాసా స్వచ్ఛంద సంస్థ కో ఆర్డినేటర్ ఎం.ప్రేమ్‌కుమార్ తెలిపారు. మంగళవారం మండలంలోని మాదిరిపురంలో జరిగిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన కలిగి ఉండి గ్రామసభలో సమస్యలపై పోరాడి పరిష్కార మార్గం చూపాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సభ్యులు గుజ్జ నర్సయ్య, బద్రు, నీలమ్మ, మౌనిక, వీరన్న తదితరులు పాల్గొన్నారు.

మినీ స్టేడియం నిర్మించాలి



వినతి పత్రం ఇస్తున్న డీవైఎఫ్‌ఐ నాయకులు

తిరుమలాయపాలెం: గ్రామీణ క్రీడలను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం తిరుమలాయపాలెం మండల కేంద్రంలో మినీ స్టేడియం ఏర్పాటు చేయాలని డీవైఎఫ్‌ఐ ఆధ్వర్యంలో మంగళవారం మండల తహసీల్దార్ పుల్లయ్యకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా కార్యదర్శి షేక్.బషీరుద్దీన్ మాట్లాడుతూ.. మండలంలో వేలాది మంది యువతకు ఆట స్థలాలు లేక ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు దిండు మంగపతి, దాసరి మహేందర్, నెర్సుల వెంకటేష్, పవన్ పాల్గొన్నారు.

వేతనాలపై బిల్డర్ల అసోసియేషన్ భేటీ



మాట్లాడుతున్న అసోసియేషన్ బాధ్యులు

ఖమ్మంమయూరిసెంటర్: భవన నిర్మాణ రంగంలో సుతారి మేస్త్రి, కూలీల రేట్లను నిర్ణయించేందుకు మంగళవారం రాత్రి బిల్డర్ల అసోసియేషన్ ఆధ్వర్యంలో నగరంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో సమావేశం అయ్యారు. బిల్డర్ల అసోసియేషన్ అధ్యక్షుడు తుంపాల కృష్ణమోహన్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో అసోసియేషన్ ప్రతినిధులు మాట్లాడుతూ.. సుతారికి రూ.800, మగ కూలీకి రూ.570, ఆడ కూలీకి రూ.550లు ఇవ్వాలని నిర్ణయించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బిల్డర్ల అసోసియేషన్ ప్రతినిధులు గరికపాటి ఆంజనేయ ప్రసాద్, కొప్పు నరేష్, బండి జయకిషోర్, దోసపాటి ప్రవీణ్, వాసిరెడ్డి నాగేశ్వరరావు, రామ్మూర్తి, శ్రీనివాస తదితరులు పాల్గొన్నారు.

నగరంలో సినిమాలు


తిరుమల	పీఎస్–2
వినోద	విరూపాక్ష
సాయిరాం	రామబాణం
ఆదిత్య	ఉగ్రం
శ్రీనివాస	ఏజెంట్
సుందర్	విద్యార్థి

- ఖమ్మంగాంధీచౌక్

‘ధరణి’తో అవస్థలెన్నో..?

రిజిస్ట్రేషన్ల కోసం రైతుల ఇక్కట్లు

- భూ క్రయవిక్రయాలకు తప్పని పాట్లు
- ఆన్‌లైన్ సేవలకు ఆపసోపాలు
- భూరికార్డులలో అన్నీ తప్పుల తడకలే
- అమలులో జాప్యంపై సర్వత్రా అసహనం



ఖమ్మంరూరల్: భూ క్రయవిక్రయాలకు సంబంధించిన లావాదేవీలను సులభతరం చేసేందుకు ప్రభుత్వం ఆయా మండలాల్లోని తహసీల్దార్ కార్యాలయాల్లో రిజిస్ట్రేషన్లు అమలు చేసేందుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. అయితే ఇంతవరకు అమలులో జాప్యం కావడంతో రిజిస్ట్రేషన్ కార్యాలయాలకు వెళ్లలేక, వెళ్లినా దళారులు, ఏజెంట్ల బెడదతో రైతులు నానా ఇబ్బందులు పడుతున్నారు. ఈ బెడదను తొలగించి రైతులకు ఆన్‌లైన్ సేవల ద్వారా పారదర్శకంగా భూ క్రయవిక్రయాల రిజిస్ట్రేషన్లను నేరుగా తహసీల్దారే చేసే విధంగా అమలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించి అమలు చేపట్టింది. కానీ అమలు చేయడంలో తీవ్ర జాప్యం జరుగుతోంది.

ఆన్‌లైన్‌లో సమగ్ర భూ వివరాలు..

ఇంతకు ముందు ఆన్‌లైన్‌లో నమోదు కాని భూ వివరాలు, భూ రికార్డుల ప్రక్షాళన అనంతరం ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. పట్టణాలు, నగరాలకు పరిమితమైన రిజిస్ట్రేషన్ కార్యాలయాలను మండల కేంద్రాల్లో అందుబాటులోకి తీసుకొచ్చేందుకు ప్రభుత్వం ధరణి వెబ్‌సైట్ తీసుకొచ్చింది. సబ్ రిజిస్ట్రేషన్ల ప్రక్రియపై తహసీల్దార్లతో పాటు కంప్యూటర్ ఆపరేటర్లకు శిక్షణ ఇచ్చి అమలు చేస్తున్నారు. కాగా, తహసీల్దార్ సబ్ రిజిస్ట్రార్‌గా వ్యవహరించి ధరణి వెబ్‌సైట్ ద్వారా సేవలు అందిస్తున్నారు. కానీ ధరణి వెబ్‌సైట్ ద్వారా భూ రికార్డుల నమోదు సరిగా లేక పనులు తీవ్ర జాప్యంగా జరుగుతున్నట్లు తెలుస్తోంది.

అన్నీ తప్పుల తడకలే..

మండల కేంద్రాల్లోని తహసీల్దార్ కార్యాలయాల్లో రిజిస్ట్రేషన్లు జరగడంలో ఆలస్యం అవుతున్నాయి. భూ రికార్డుల్లో గతంలో అనేక తప్పులు దొర్లినా.. వాటిని సరిచేయడంలో ధరణిలో ఉన్న వివరాలకు, రైతులకు వాస్తవంగా క్షేత్రస్థాయిలో ఉన్న భూములకు ఎలాంటి పొంతన లేకపోవడంతో రైతులు అవస్థలు పడుతున్నారు. ఉదాహరణకు ఒకరి పేరు మీద రెండున్నర ఎకరాల భూమి ఉంటే.. అందులో కేవలం ఎకరంన్నర మాత్రమే పట్టాదారు పాస్ పుస్తకంలో నమోదైంది. సదరు రైతు మిగతా ఎకరం భూమి క్షేత్రస్థాయిలో ఉన్నప్పటికీ అది అతని పేరున రావడంలేదు. దీంతో ఆ ఎకరం భూమి తన పేరు మీద రికార్డుల్లో నమోదు చేయాలని రెవెన్యూ కార్యాలయాల ఏళ్ల తరబడి తిరుగుతున్నా.. పని మాత్రం కావడంలేదు. ఇలా మండలంలో చాలా మంది రైతులు రికార్డుల్లో నమోదు కాకపోవడంతో అత్యవసర పరిస్థితుల్లో ఆ భూమిని అమ్మాలన్నా కుదరం లేదు. అదే విధంగా ప్రభుత్వం నుంచి రావాల్సిన రైతుబంధు సొమ్ము కూడా రాక నానా అవస్థలు పడుతున్నారు. అధికారులు తప్పులను సరిచేసి భూరికార్డులను సవ్యంగా ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

ధరణితో ప్రయోజనాలు ఇలా..

- నకిలీ రిజిస్ట్రేషన్లకు అవకాశం ఉండదు.
- తహసీల్దార్ భూముల రికార్డుల ప్రక్రియలో వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవడంతో వారికి అవగాహన ఉంటుంది.
- రిజిస్ట్రేషన్ కాగానే మొదటి మ్యూటేషన్ చేయడంతో పహాణీలో నమోదు చేసుకునేందుకు కార్యాలయం చుట్టూ తిరగాల్సిన అగత్యం తప్పుతుంది.
- సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద దళారుల బెడద ఉండడంతో తప్పుడు రిజిస్ట్రేషన్లకు అవకాశం ఉంటుందని అధికారులు చెబుతున్నా.. వాస్తవ పరిస్థితి అందుకు భిన్నంగా ఉంది.

రెండేళ్ల నుంచి తిరుగుతున్నా..



మంగళగూడెంలో ఉన్న పది ఎకరాల భూమిలో నాలుగు ఎకరాలు పాస్ పుస్తకంలో నమోదు కాలేదు. భూమి ఉంది కానీ పాస్‌బుక్‌లో లేకపోవడంతో రైతుబంధు కూడా రావడంలేదు. అదీగాక భవిష్యత్‌లో భూమిని ఏదైనా చేద్దామంటే చేయలేని పరిస్థితి. పాస్‌బుక్‌లో నమోదు చేయాలని అధికారుల చుట్టూ తిరుగుతున్నా పని కావడంలేదు.

– పి. నాగేశ్వరరావు, రైతు, మంగళగూడెం

‘ధరణి’ ఆపరేటర్‌కు సన్మానం..



సన్మానిస్తున్న తహసీల్దార్, తదితరులు

రఘునాథపాలెం: రఘునాథపాలెం మండల ధరణి ఆపరేటర్‌గా విధులు నిర్వహిస్తున్న జ్యోతి బదిలీ అయ్యారు. ఈ మేరకు కార్యాలయంలో మంగళవారం తహసీల్దార్ నరసింహారావు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సాధారణ బదిలీలో భాగంగా బదిలీ అయిన జ్యోతి భూక్రయ, విక్రయాల నమోదులో కీలక పాత్ర వహించిందన్నారు. ఈ కార్యక్రమంలో డీటీ, ఆర్‌ఐలు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

రైతులపై ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదు



సమావేశంలో మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

ఖమ్మం మామిళ్లగూడెం: రైతులపై తెలంగాణ ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేకనే నేటికీ పంట కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయడం లేదని ఏఐపీకేఎస్ ఖమ్మం జిల్లా ప్రధాన కార్యదర్శి ఆవుల వెంకటేశ్వర్లు విమర్శించారు. మంగళవారం రామనర్సయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. మార్క్‌ఫెడ్ ద్వారా మొక్కజొన్న కొనుగోలు చేస్తామని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించి వారం రోజులైనప్పటికీ నేటికి ప్రారంభించకపోవటంతో రైతాంగం ప్రైవేట్ వ్యాపారులకు అమ్ముకొని తీవ్రంగా నష్టపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కాంటా వేయగానే పంట తడిస్తే ప్రభుత్వమే బాధ్యత వహించాలన్నారు. ఫారెస్టు, పట్టాలు లేని భూముల్లో పండించిన పంటను కొనుగోలు చేయలేమని నిబంధనలు విధించినట్లు తెలిసిందని చెప్పారు. ప్రభుత్వం వెంటనేఅన్ని మండలాల్లో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో జిల్లా అధ్యక్షుడు నాగేశ్వరావు, నాయకులు అచ్చయ్య, కె.నాగేశ్వరావు, అప్పారావు, శ్రీను, మారుతి, మల్ల య్య, వెంకటస్వామి, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

విప్లవ వీరుల త్యాగాలు మరువలేనివి

ఖమ్మం మామిళ్లగూడెం: విప్లవ వీరుల త్యాగాలు మరువలేనివని అరుణోదయ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు పరకాల నాగన్న అన్నారు. అరుణోదయ రామారావు 4వ వర్ధంతిని మంగళవారం ఖమ్మం లెనిన్‌నగర్ సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. అరుణోదయ రామారావు చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జిల్లా అధ్యక్షుడు నాగేశ్వరావు, మురళీమోహన్‌రావు, పటేల్, సందీప్, లక్ష్మి, ఉపేందర్, మణికంఠ, చలపతి తదితరులు పాల్గొన్నారు.

‘ఉపాధి’ కూలి రూ.600 ఇవ్వాలి

ఖమ్మంరూరల్: ఉపాధి కూలీలకు 200 పనిదినాలు కల్పించి రోజుకు రూ.600 వేతనం చెల్లించాలని అఖిల భారత ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శివలింగం, బందెల వెంకయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం మండలంలోని మంగళగూడెంలో జరిగిన సదస్సులో వారు మాట్లాడారు. ఎండల తీవ్రతతో కూలీలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, వారికి నీడ తాగునీటి వసతి, వైద్య సేవలు అందించాలని, వడదెబ్బతో మృతిచెందిన కూలీలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం డివిజన్ అధ్యక్షుడు సోమనపల్లి వెంకటేశ్వర్లు, యాదగిరి, వీర్ల వెంకటప్పారావు, వెంకన్న, భిక్షం, సూరమ్మ, రాంబాయి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన



శంకుస్థాపన చేస్తున్న మేయర్ నీరజ

ఖమ్మంమయూరిసెంటర్: నగరంలోని 40, 42 డివిజన్‌లలో సుడా నిధులు రూ.40 లక్షల వ్యయంతో నిర్మించనున్న సీసీ రోడ్ల పనులకు మంగళవారం మేయర్ పునుకొల్లు నీరజ, సుడా చైర్మన్ బచ్చు విజయ్‌కుమార్‌తో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ.. కేఎంసీ పరిధిలో రోడ్లన్నింటినీ మంత్రి అజయ్‌కుమార్ కృషితో అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు దాదే అమృతమ్మ, పాకలపాటి విజయనిర్మల, డీఈ నవ్యజ్యోతి పాల్గొన్నారు.

‘కంటి వెలుగు’ ప్రారంభం..

ఖమ్మంమయూరిసెంటర్/ఖమ్మంవ్యవసాయం: నగరంలోని 36వ డివిజన్‌లో గల డీసీసీబీ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన కంటి వెలుగు శిబిరాన్ని మేయర్ పునుకొల్లు నీరజ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ కూరాకుల నాగభూషణం, మార్కెట్ చైర్మన్ దోరేపల్లి శ్వేత, కార్పొరేటర్ రామ్మోహన్‌రావు, అడిషనల్ డీఎంఅండ్‌హెచ్‌ఓ రాంబాబు, వైద్యాధికారులు లోహిత్, అరుణ్‌కుమార్, పవన్‌కుమార్, కొత్త వెంకటేశ్వర్లు, కన్నం ప్రసన్న కృష్ణ, పిల్లుట్ల కృష్ణ, తాళ్లూరి శైలజ తదితరులు పాల్గొన్నారు.

అల్టిమేటం లెక్కచేయని కార్యదర్శులు



రఘునాథపాలెం: బైక్ ర్యాలీ తీస్తున్న జేపీఎస్‌లు

రఘునాథపాలెం/ఖమ్మంరూరల్: జూనియర్ పంచాయతీ కార్యదర్శులు తమ న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని గత 10 రోజులుగా తలపెట్టిన సమ్మెను ప్రభుత్వం విధుల్లోకి చేరకుంటే తొలగిస్తామని అల్టిమేటం ఇచ్చినా.. లెక్క చేయకుండా మంగళవారం తమ ఆందోళనలు కొనసాగించారు. రఘునాథపాలెం మండల జూనియర్ పంచాయతీ కార్యదర్శులు నల్లదుస్తులు ధరించి ప్లకార్డులు చేతపట్టుకొని నినాదాలు చేస్తూ రఘునాథపాలెంలోని ఆపిల్ సెంటర్ నుంచి గ్రామంలో అంబేడ్కర్ విగ్రహం వరకు ర్యాలీ తీసి ప్రభుత్వ మనసు మార్చి తమకు న్యాయం చేయాలంటూ నినాదాలు చేశారు. అలాగే ఖమ్మంరూరల్ మండలంలోని జలగంనగర్ నుంచి నాయుడుపేట చౌరస్తా వరకు కార్యదర్శులు ర్యాలీ తీశారు.ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి పి. మోహన్ రావు మాట్లాడగా.. నాయకులు శ్రీనివాసరావు, సాయికుమార్, రాధా రాణి, రామకృష్ణ, భవ్య, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య పనుల ఆకస్మిక తనిఖీ



కార్మికుల హాజరు నమోదును పరిశీలిస్తున్న కమిషనర్

ఖమ్మంమయూరిసెంటర్: నగరంలోని పారిశుద్ధ్య పనుల నిర్వహణను కేఎంసీ కమిషనర్ ఆదర్శ్ సురభి మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఉదయం 6 గంటలకే కమిషనర్ స్వయంగా సైకిల్‌పై తిరుగుతూ పలు డివిజన్లలో పారిశుద్ధ్య పనులను పరిశీలించి పారిశుద్ధ్య కార్మికులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కార్మికుల బయోమెట్రిక్ హాజరును తనిఖీ చేశారు. గృహాలు, వ్యాపార సముదాయాల నుంచి వెలువడే చెత్తను నేరుగా వాహనాల్లోకి సేకరించాలని, రోడ్ల వెంట పడేయకుండా చూడాలని సిబ్బందిని ఆదేశించారు. నగరంలో ఎక్కడైనా రోడ్ల వెంట చెత్త కుప్పలు కనబడితే అక్కడ శానిటరీ ఇన్‌స్పెక్టర్, జవాన్‌లపై చర్యలు తీసుకోబడతాయని హెచ్చరించారు. పారిశుద్ధ్య నిర్వహణలో లోపాలు కనిపిస్తే కఠిన చర్యలు ఉంటాయన్నారు.

సంతకాల సేకరణ



సంతకాలు సేకరిస్తున్న దృశ్యం

ఖమ్మం మామిళ్లగూడెం: రెజ్లర్లకు మద్దతుగా భారత జాతీయ మహిళా సమాఖ్య ఆధ్వర్యాన మంగళవారం ఖమ్మం కొత్త బస్టాండ్‌లో సంతకాల సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షురాలు పోటు కళావతి మాట్లాడుతూ.. మహిళా రెజ్లర్ల న్యాయమైన సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. బీజేపీ ఎంపీ బ్రిజ్‌భూషణ్ శరణ్‌సింగ్‌ను వెంటనే అరెస్టు చేయాలన్నారు. లైంగిక వేదింపులకు పాల్పడిన రెజ్లింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ప్రెసిడెంట్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తాటి నిర్మల, సీతామహాలక్ష్మి, మమత, శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

20 మందిపై కేసు నమోదు

రఘునాథపాలెం: తాగునీరు, విద్యుత్ సౌకర్యంతో పాటు రోడ్ల నిర్మాణం చేయాలని వినోభానవోదయ కాలనీకి చెందిన నివాసులు సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేసి రాకపోకలకు ఇబ్బంది కల్గించినందుకు 20 మందికి పైగా రఘునాథపాలెం స్టేషన్‌లో కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ ఎం.రవి తెలిపారు. మండే ఎండలో వాహనదారులు, ప్రయాణికులను ఇబ్బంది పెట్టినందకే కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఇంటర్ ఫలితాల్లో విద్యార్థుల ప్రతిభ



లావణ్య (922), ఎంపీసీ; యమున(952), బైపీసీ; సిరిచందన (962), బైపీసీ

తెలంగాణ ఇంటర్మీడియట్ బోర్డు మంగళవారం విడుదల చేసిన ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సర ఫలితాల్లో ప్రైవేట్ కళాశాలలకు దీటుగా ప్రభుత్వ కళాశాలల విద్యార్థులు ప్రతిభ చాటారు. ఈ సందర్భంగా ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ఆయా కళాశాలల ప్రిన్సిపాళ్లు, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది అభినందించారు.

నేలకొండపల్లి గురుకులంలో..



బి.శిరీష (980), ఎంపీసీ; కావ్య(979), బైపీసీ



బి.మమత(454), ఎంపీసీ

నేలకొండపల్లి: మండలంలోని నేలకొండపల్లి సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాలలో ద్వితీయ సంవత్సర విద్యార్థులు 92 శాతం, ప్రథమ సంవత్సర విద్యార్థులు 82 శాతం మంది ఉత్తీర్ణత సాధించారు. ద్వితీయ సంవత్సర ఫలితాల్లో ఎంపీసీలో బి.శిరీష (980), బైపీసీలో పి.అనూష(979), కావ్య (979) మార్కులు సాధించి టాపర్‌గా నిలిచారు. ప్రథమ సంవత్సర ఫలితాల్లో ఎంపీసీలో బి.మమత(454), బైపీసీలో చంద్రిక(408) మార్కులు సాధించి టాపర్‌గా నిలిచారు. నేలకొండపల్లి ప్రభుత్వ జూనియర్ కాలేజీలో మొదటి సంవత్సర విద్యార్థులు 155 మందికి 103, రెండో సంవత్సర విద్యార్థులు 79 మందికి 41 మంది ఉత్తీర్ణత సాధించారు.

కేజీబీవీలో..

తిరుమలాయపాలెం: తిరుమలాయపాలెం కేజీబీవీ కళాశాలలో ద్వితీయ సంవత్సర విద్యార్థులు బైపీసీలో ఆర్.యమున(952), ఎంపీసీలో బి.లావణ్య(922) మార్కులు సాధించి ప్రథమ స్థానంలో నిలిచారు. అలాగే ప్రథమ సంవత్సరంలో ఎంపీసీలో రష్మిత(453), బైపీసీలో అనూష(405) మార్కులు సాధించి టాపర్‌గా నిలిచారు.

పిండిప్రోలు కళాశాలలో..

పిండిప్రోలు కళాశాలలో బైపీసీ ద్వితీయ సంవత్సరంలో సిరిచందన(962) మార్కులు సాధించి కళాశాల టాపర్‌గా నిలించింది.

కస్తూర్బాలో..



అనూష(441), సీఈసీ; శ్రావణి(946), సీఈసీ



రాజేశ్వరి(466), ఎంపీహెచ్‌డబ్ల్యూ; మీనాక్షి(949), ఎంపీహెచ్‌డబ్ల్యూ

కూసుమంచి: మండలంలోని కస్తూర్బా పాఠశాలలో ప్రథమ సంవత్సరం సీఈసీ గ్రూపులో 72 శాతం, ద్వితీయ సంవత్సరంలో 88 శాతం ఫలితాలు రాగా ఎంపీహెచ్‌డబ్ల్యూ గ్రూపులో ప్రథమ, ద్వితీయ సంవత్సరాల విద్యార్థులు నూరుశాతం ఫలితాలు సాధించారు. సీఈసీ ప్రథమ సంవత్సరంలో తేజావత్ అనూష(441), ద్వితీయ సంవత్సరంలో బారి శ్రావణి(946) మార్కులతో ప్రథమంగా నిలిచారు. ఎంపీహెచ్‌డబ్ల్యూ గ్రూపులో ప్రథమ సంవత్సరంలో ధరావత్ రాజేశ్వరి(466), ద్వితీయ సంవత్సరంలో వడిత్య మీనాక్షి(949) మార్కులతో టాపర్‌గా నిలిచారు.

‘ప్రైవేట్’ విద్యార్థుల సత్తా..



విద్యార్థులను అభినందిస్తున్న సీ.వీ.రామన్ యాజమాన్యం



విజయచిహ్నం చూపిస్తున్న నారాయణ కళాశాల బాధ్యులు

ఎక్స్‌లెంట్ విద్యార్థుల విజయకేతనం..

ఖమ్మంసహకారనగర్: ఇంటర్మీడియట్ ఫలితాల్లో ఎక్స్‌లెంట్ జూనియర్ కళాశాల విద్యార్థులు విజయకేతనం ఎగుర వేశారని కరస్పాండెంట్, ప్రిన్సిపాల్ చల్లా శేషగిరి పేర్కొన్నారు. ప్రథమ సంవత్సరం ఎంపీసీలో 470 మార్కులకు వి.పార్థివ్ సాయి నగేష్ 462 మార్కులు, టి.లక్ష్మీపూర్ణిమ 461 మార్కులు, వై.ఉమేష్ చంద్రన్ 461 మార్కులు సాధించారు. బైపీసీలో 440 మార్కులకు కె.దివ్యతార 430, ఎల్.యశస్విని సరోజ 426, జి.మణిశంకర్ 416, బి.లక్ష్మణ్ సాహిత్ 416 మార్కులు పొందారు. ద్వితీయ సంవత్సరంలో బి.హన్సిక 1000 మార్కులకు 983, పి.అంజన 981, నవ్యమాధురి 981, బిందు 981 మార్కులు సాధించగా యాజమాన్యం అభినందించింది.

- సాహితీ కళాశాల విద్యార్థులు ప్రతిభ కనబర్చారని చైర్మన్ నాగేశ్వరరావు, సెక్రటరీ, కరస్పాండెంట్ శ్రీనివాసరావు, ప్రిన్సిపాల్ వెంకన్న, డైరెక్టర్ తిరుపతయ్య తెలిపారు. ఎంపీసీలో వి.సాయిప్రశాంతి 971, రంజిత 966, బైపీసీ విభాగంలో కావ్య 973, జూనియర్ ఎంపీసీలో తేజావత్ పవన్ కల్యాణ్ 460, బైపీసీలో తేజశ్విని 431మార్కులు సాధించారని వెల్లడించారు.
- ఇంటర్ ఫలితాల్లో ఖమ్మం నారాయణ విద్యార్థులు జయకేతనం ఎగురవేశారని కోర్ డీన్ వెంకటరెడ్డి, డీన్ పాటి మాధవరావు తెలిపారు. జూనియర్ ఎంపీసీలో సీహెచ్.సాయికుస్మిత 467 మార్కులు, పి.కౌస్తుభ్ గుప్తా 466, ఎన్.సంజన 465, ఎన్.రిషిత 465, ఎస్.భవిష్య 465, ఎం.సాయి తేజ 464, పి.హన్సిత 464, డి.శ్రీరాం 464 మార్కులు సాధించగా.. సీనియర్ ఎంపీసీలో జి.శ్రీహారిక 986, ఎ.యువన 985, ఎన్.రాగమయి 984, వై.సాయిసందీప్‌రెడ్డి 981, ఎం.ఖ్యాతి ప్రియ 981 మార్కులు సాధించగా, కోర్‌డీన్, డీన్‌తోపాటు ఏజీఎం సురేష్‌బాబు, అధ్యాపకులు అభినందించారు.
- శ్రీ సీవీ రామన్ జూనియర్ కాలేజీ విద్యార్థులు ప్రతిభ చూపారని యజమాన్య బాధ్యులు ఆళ్లపావని రవికుమార్, నరసింహారావు పేర్కొన్నారు. జూనియర్ ఎంపీసీలో ఎస్.లవణ్‌కుమార్ 464, డి.రాజేష్ 464, ఎం.ఉమారాణి 459, ఎల్.బిందు 458 మార్కులు, సీఈసీలో డి.ఉదయశ్రీ 470, ఎన్.నవ్యశ్రీ 400 మార్కులు, బైపీసీలో కె.ప్రణవ్ 433 మార్కులు సాధించగా, సీనియర్ ఎంపీసీలో కె.దుర్గాభవాని 969 మార్కులు, కె.జస్వంత్ 966, బి.హనుమంతు 966, కె.నందినీదేవి 973, బి.ఈశ్వర్ 965 మార్కులు సాధించారని తెలిపారు.
- ఇంటర్మీడియట్ ఫలితాల్లో తమ విద్యార్థులు ఉత్తమ మార్కులు సాధించారని సిరిచైతన్య జూనియర్ కళాశాల కరస్పాండెంట్ జి.సోమయ్య తెలిపారు. ఎంపీసీలో పి.శివాని 962మార్కులు, బైపీసీలో జి.స్రవంతి 966మార్కులు, సీఈసీలో రాంచరణ్ 912, జూనియర్ ఎంపీసీలో కె.ద్వి 465మార్కులు, బి.లెనిన్ 464మార్కులు సాధించారని పేర్కొన్నారు.

బొడ్రాయి ప్రతిష్ఠకు రూ.85 వేలు వితరణ



వితరణ అందిస్తున్న శ్రావణ్‌కుమార్

ఖమ్మంఅర్బన్: నగరంలోని 8వ డివిజన్ వైఎస్‌ఆర్ కాలనీలో ఈ నెల 14న ఆదివారం జరగనున్న బొడ్రాయి ప్రతిష్ఠా మహోత్సవ వేడుకల్లో విగ్రహాల ఏర్పాటుకు మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనన్న సైన్యం తరఫున రూ.85,116లను యూత్ నాయకుడు బోడా శ్రావణ్‌కుమార్ ఆలయ కమిటీ సభ్యులకు మంగళవారం అందించారు. భవిష్యత్‌లోనూ శ్రీనన్న సైన్యం తరఫున ఆలయ అభివృద్ధికి తమ వంతు తోడ్పాటు అందిస్తామని శ్రావణ్ తెలిపారు. ఈమేరకు నిర్వహణ కమిటీ సభ్యులు దాతలను ప్రత్యేకంగా అభినందించారు.



అటెన్షన్ ప్లీజ్

పొంచి ఉన్న ప్రమాదం!



సుమారు వందేళ్ల చరిత్ర కలిగిన ఓ వృక్షం.. ప్రస్తుతం ప్రజలకు ప్రమాదకంగా మారింది. మండలంలోని చెన్నారంలో గత పదేళ్ల క్రితం ఓ చింతచెట్టు బారిగా పెరగడంతో కొమ్మలను తొలగించారు. ప్రస్తుతం చెట్టు మొదలు తొర్రలు పడి పైన కొమ్మలు ఎండిపోవడంతో ఇటీవల కురిసిన వర్షం, ఈదురు గాలులకు చాలా వరకు విరిగి పడింది. కాగా, రహదారి వెంట నిత్యం ప్రయాణికుల రాకపోకలు సాగిస్తుండడంతో ఏ సమయంలో వృక్షం విరిగి పడుతుందోనని ఆందోళన చెందుతున్నారు. ఇకనైనా సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి కనీసం కొమ్మలనైనా తొలిగించాలని పలువురు కోరుతున్నారు.

- నేలకొండపల్లి